క్లుప్తంగా

చర్చి నిర్మాణానికి రూ.50 వేల విరాళం



ఆర్థిక సాయం అందజేస్తున్న చంద్రన్న

దేవనకొండ: మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో చర్చి పైకప్పు నిర్మాణానికి ఉద్దే చంద్రన్న రూ.50 వేలను విరాళంగా అందించారు. ఆదివారం చర్చి నిర్వాహకులకు నగదు అందజేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రౌడీషీటర్లు, మట్కా నిర్వాహకులకు ఆదివారం ఎస్‌ఐ సునీల్‌కుమార్ తన కార్యాలయం ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు బుద్ధిగా ఉండాలని, ఎలాంటి గొడవల్లో తల దూర్చరాదని హితవుపలికారు. మంచి నడవడికతో అందరితో మంచిగా మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్కా నిర్వహించినట్లు తేలితే కేసులు నమోదు చేస్తామన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తుగ్గలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షర్మిల తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు. వాటిని విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు.

పీర్ల పండుగ ప్రారంభం



వెల్దుర్తిలో దస్తగిరిస్వామి పీర్లచావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాట్లు

వెల్దుర్తి(కృష్ణగిరి): మొహర్రం ఆదివారం నెలవంక దర్శనంతో ప్రారంభమైంది. పది రోజుల పాటు జరుపుకునే పీర్ల పండుగను పురస్కరించుకుని వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల వ్యాప్తంగా పీర్లచావిడిల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. అగ్నిగుండాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలని వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్‌ఐలు సునీల్‌కుమార్, ఖాజావలి సూచించారు.

ఉపాధి వేతనాలు ఇవ్వండి

మద్దికెర: ఉపాధి హామీ పథకంలో రెండు నెలలు పనిచేసినా వేతనాలు ఇవ్వలేదని మేటీలు ప్రసాద్‌రావు, జగదీల్, శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగితే అదిగో ఇదిగో అంటూ దాటవేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థుల సమస్యలపై మంత్రికి వినతి

హొళగుంద: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్, తెలుగు, కన్నడ, ఉర్దూ మీడియం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని హొళగుందకు చెందిన మైనార్టీ నాయకులు ఆదివారం మైనార్టీశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కోరారు. ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు అతావుల్లా, ఈశా, వార్డు సభ్యులు సుభాన్, అబ్దుల్ హమీద్, విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఇర్ఫాన్ తదితరులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో సీబీఎస్‌ఈ ప్రవేశపెట్టడం వల్ల కన్నడ, ఉర్దూ మీడియం విద్యార్థులను అడ్మిషన్ చేసుకోవడం లేదని వాపోయారు. సమస్యను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి ఫరూక్ తెలిపారు.

ప్రజా పోరాటంలో ముందుండాలి

ఆలూరు: ప్రజా పోరాటంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు ముందుండాలని ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, షాకీర్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. నాయకులు నారాయణ స్వామి, ఈరన్న పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణ ఏదీ..?

- ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో నియంత్రణ సాధ్యమా..?
- నామమాత్రంగా పారిశుద్ధ్య చర్యలు
- ముందస్తు జాగ్రత్తలో అధికార యంత్రాంగం విఫలం
- సమావేశాలు, అవగాహన కార్యక్రమాలతోనే సరి



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మొలగవల్లి వైద్య సిబ్బంది



అరికెర గ్రామంలో రోడ్డుపై నిలిచిన మురుగు



ఆలూరు గుంతకల్లు చెక్‌పోస్టు సమీపంలో చెత్త కుప్ప

ఆలూరు రూరల్: డయేరియా (అతిసార) నియంత్రణలో ప్రభుత్వంతో పాటు అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమవుతోంది. వాతావరణంలో మార్పులు.. నైరుతి ప్రభావంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలుతున్నాయి. అయితే డయేరియా నియంత్రణ అంటూ వైద్యారోగ్య శాఖ అధికారులు సమావేశాలు, అవగాహన ర్యాలీలు, పోస్టర్ల ఆవిష్కరణల హడావుడి తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. గత ప్రభుత్వం ప్రపంచాన్ని వణికించిన కరోనానే పటిష్టమైన ప్రణాళికతో నియంత్రించింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రణాళికలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇక సీజనల్ వ్యాధుల నియంత్రణలో కూడా ముందస్తు జాగ్రత్తలు, ప్రణాళికలు మంచి ఫలితాలు ఇచ్చాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం డయేరియాను నియంత్రించలేక చేతులెత్తేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు, వైద్య సిబ్బంది మాత్రం బ్యానర్లు పట్టుకుని అవగాహన పేరుతో ప్రచారం చేస్తూ మమ అనిపిస్తున్నారు.

ఏవీ ముందస్తు చర్యలు

ఒకప్పుడు మే, జూన్ నెలల్లో ఐదేళ్లలోపు చిన్నారులు, వృద్ధులు అతిసార బారిన పడేవారు. సరైన చికిత్స అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. దీంతో అప్రమత్తం చేసేందుకు ప్రతి ఏడాది జూలై 1 నుంచి 15 రోజుల పాటు డయేరియా పక్షోత్సవాలు నిర్వహించేవారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ డయేరియా నియంత్రణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెండు నెలల పాటు సుదీర్ఘ ప్రచారం నిర్వహించనున్నారు. అయితే కేవలం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి అవగాహన కల్పిస్తే అతిసార నియంత్రణ సాధ్యం కాదు. తాగునీటి సరఫరా నిర్వహణ పరిస్థితులపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలి. తాగునీటి బ్లీచింగ్ పౌడర్ కలిపి సరఫరా చేయాలి. తాగునీటి సరఫరా ట్యాంకులు శుభ్రం చేయించాలి. వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేయాలి.

డయేరియా ఎందుకు వస్తుంది

డయేరియా ఎక్కువగా జూన్ నుంచి ఆగస్టు మాసాల్లో వస్తుంది. తాగునీరు కలుషితం కావడం దీనికి ప్రధాన కారణం. వర్షాకాలంలో నీరు కలుషితం కావడంతో నీటిలోని బ్యాక్టీరియా వల్ల విరేచనాలు అవుతాయి. కలుషిత నీరు, ఆహారంలోని రోటా వైరస్‌లు శరీరంలోకి చేరి డయేరియాకు కారణం అవుతున్నాయి. రోజు మొత్తం 4 సార్లు కంటే ఎక్కువగా నీళ్ల విరేచనాలైతే వెంటనే శరీరంలో నీటి శాతం తగ్గి డీ హైడ్రేషన్ ఏర్పడుతుంది. ఇది ఒక్కోసారి ప్రాణాంతకం అవుతుంది. పెద్దల కంటే చిన్నారులకు ఇది మరింత ప్రమాదకరం.

నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు

నియోజకవర్గ కేంద్రమైన ఆలూరుతో పాటు అన్ని మండలాల్లోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నామమాత్రంగా ఉన్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికి తిరిగి చెత్త సేకరించినా దాన్ని గ్రామాల్లో రెండు మూడు చోట్ల డంప్ చేస్తున్నారు. మురుగు



ఆలూరులో ఇంటింటికి సరఫరా చేసిన రంగుమారిన తాగునీరు

కాలువలు శుభ్రం చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. కొన్ని పల్లెల్లో మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. అలాగే వారినికి రెండు సార్లు దోమల పొగ వదలాల్సి ఉన్నా అది ఆచరణకు దూరంగా ఉంది.

అవగాహన ర్యాలీలు, సమావేశాలకే పరిమితం

డయేరియా వ్యాధి నియంత్రణలో అధికారులు విఫలమవుతున్నారు. ఆరోగ్య సిబ్బంది వారంలో రెండు రోజులు సీజనల్ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల పేరుతో ర్యాలీలు, పోస్టర్లు విడుదల చేసి ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే కొందరు ఆరోగ్య సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. గ్రామాల్లో దోమలు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేయడంలో విఫలమవుతున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదు. అధికారులు మాత్రం సమావేశాలు ఏర్పాటు చేసి అదిచేయాలి, ఇది చేయాలని ఇచ్చే ఆదేశాలు పేపర్ల వరకే పరిమితం అవుతున్నాయి. దీంతో డయేరియా కేసులు మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీ కేంద్రాల్లో ఓపీల సంఖ్య పెరుగుతోంది. ఒక్క ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే రోజుకు 200 నుంచి 250 మంది రోగులు వస్తున్నారు. ఇందులో 100 లోపు కేసులు డయేరియావే ఉన్నాయి.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

ఆలూరు: నియోజకవర్గ కేంద్రం ఆలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేత బీసీ మాదన్న తెలిపారు. ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి హాజరుకానున్నరని చెప్పారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా గుంతకల్లు చౌరస్తాలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ఆస్పరి: మండల కేంద్రం ఆస్పరిలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

హాలహర్వి: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

దేవనకొండ: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీను తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



గజ్జహళ్లిలో కేక్ కట్ చేస్తున్న దళితులు,



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో ఆదివారం మాదిగ రిజర్వేషన్ల పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక దినోత్సవంతో పాటు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కెంచప్ప మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆస్పరి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని ఆస్పరి, కైరుప్పల గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆస్పరిలో ఎమ్మార్పీఎస్ జెండాను సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సంజప్ప, కైరుప్పలలో వీరభద్రి ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారానికి మాదిగలు ఐక్యమత్యంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజన్న, రామాంజనేయులు, మనోజ్, ఉసేని, సింగారయ్య, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం

మద్దికెర: ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా నాయకుడు ఆనంద్ కుమార్ మాదిగ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎం.అగ్రహారంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జెండాను ఆవిష్కరించారు. మాదిగలు ఐక్యతతో హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాము మాదిగ, ఈశ్వరయ్య మాదిగ, పక్కీరప్ప, మల్లికార్జున, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



రికార్డులను పరిశీలిస్తున్న కర్నూలు విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్

దేవనకొండ: పట్టణంలోని సత్యసాయి ఏజెన్సీస్, సాయిగణేష్ ట్రేడర్స్, కిసాన్‌మాల్ సెంటర్, మన గ్రోమోర్ ఎరువుల దుకాణాలను ఆదివారం కర్నూలు విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్, ఏడీఏ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సాయిగణేష్ ట్రేడర్స్‌లో బీసీలు ఇంక్లూడ్ చేసుకోలేదని, స్టాప్ సేల్ (నిలుపుదల) ఇవ్వడం జరిగిందన్నారు. 315 కేజీల ఎరువు, విత్తనాలకు సంబంధించిన విలువ రూ.5,68,060గా ఉందన్నారు. అలాగే కిసాన్‌మాల్‌లో మిషన్ బ్యాలెన్స్.. గ్రౌండ్ బ్యాలెన్స్ వ్యత్యాసం ఉన్నందున విక్రయాలు నిలుపుదల చేశామని తెలిపారు. ఇందులో ఎరువులు 8.2 టన్నులు కాగా రూ.2,62,165 వరకు విలువ ఉంటుందన్నారు. వారి వెంట ఏఓ సురేష్‌బాబు, ఏఈఓ జయరామ్ ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బళ్లారి రోడ్డులో తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె (ఫైల్)

హొళగుంద: హొళగుంద–బళ్లారి రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. మూడు అడుగుల ఎత్తు కూడా లేని కట్టపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వల్ల పిల్లలకు కూడా చేతికందేలా ఉంది. కాలువలో నీటి సరఫరా జరుగుతున్న సమయంలో ఈత కొట్టేందుకు పెద్ద సంఖ్యలో పిల్లలు, పెద్దలు వస్తుంటారు. ఆదమరిచి ట్రాన్స్‌ఫార్మర్‌కు దగ్గరికెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా జరిగి పాడి గేదె మృతి చెందింది. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చడం లేదా ఎత్తులో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కరుణ చూపని వరుణుడు

- వారంలో వర్షం కురవకుంటే పంటలు దెబ్బతినే ప్రమాదం
- ఆందోళనలో అన్నదాతలు
- సాగని ఖరీఫ్ విత్తన సాగు



ఊరిస్తున్న మేఘాలు



వాడిపోతున్న మొక్కలు

మద్దికెర: తొలకరి వర్షాలతో రైతుల్లో ఆశలు నింపిన వరుణుడు ఆ తర్వాత ముఖం చాటేశాడు. ముందస్తు వర్షాలు కురవడంతో పంటల సాగు మొదలుపెట్టారు. కొందరు ఇప్పటికే వివిధ పంటలు వేయగా మరికొందరు పొలాలను సిద్ధం చేసుకుని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు అదును దాటిపోతున్నా వరుణుడు మాత్రం ఊరిస్తూ కరుణ చూపడం లేదు. చినుకు పడకపోవడంతో రైతులు నిరాశగా ఆకాశం వైపను చూస్తున్నారు.

ఆందోళనలో రైతులు

రైతులు లక్షలాది రూపాయలు అప్పులు చేసి విత్తనాలు వేశారు. వానలు రాకపోతే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. మద్దికెర మండలంలో సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో 10 వేల ఎకరాల్లో వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, ఉల్లి తదితర పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 2,500 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేశారు. మిగిలిన వారు వానల కోసం ఎదురు చూస్తున్నారు.

సాగు చేసిన పంటలకు ఇబ్బందే

ముందస్తుగా కురిసిన వానలకు దుక్కి దున్నడానికి, ఎరువులు, విత్తనాలకు ఎకరాకు దాదాపు రూ. 5 వేలు వరకు పెట్టుబడులు పెట్టి విత్తనం వేశారు. ఇంకో వారం రోజుల్లో వానలు పడకపోతే రూ. 1.50 కోట్ల వరకు భూమిలో పోసినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు వేసిన పంటలు సకాలంలో వర్షాలు రాకపోవడంతో మొలకెత్తిన పంటలు తేమ లేక ఎండిపోతున్నాయి. దీంతో పంటలపై ఆశలు వదులుకోవాల్సిందేనని వాపోతున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పూర్తిగా నాశనం కావడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. పంటలు వస్తే అప్పులు తీర్చేసి ఆడపిల్లల పెళ్లిళ్లు చేద్దామనుకుంటే వ్యవసాయ జూదం కలిసి రాక అప్పులే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అయినా వరుణ దేవుడు కరుణిస్తాడనుకుంటే తమ ఆశలపై నీళ్లు చల్లుతున్నాడని వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

సమయం ఉంది..ఆందోళన వద్దు

ఖరీఫ్ సాగు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వర్షాలు పడినప్పుడే విత్తనాలు వేసుకోవాలి. అరకొర తేమలో విత్తుకోవడం మంచిది కాదు. ఈనెలాఖరు వరకు అవకాశం ఉంది. వాతావరణంలో మార్పులు కనిపిస్తుండడంతో వర్షాలు కురిసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

–రవి, మండల వ్యవసాయాధికారి, మద్దికెర



విత్తుకు సిద్ధం చేసిన పొలాలు



కంది పంటలో దెంతె పడుతున్న రైతులు

వలసబాట

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, బిలేహాల్ గ్రామాల నుంచి సుమారు 80 కుటుంబాలు ఆదివారం తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్లారు. స్థానికంగా ఉపాధి పనులు లేకపోవడం, వ్యవసాయ పనులు ప్రారంభం కాకపోవడంతో వలస వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. అక్కడ నీరావరి పొలాల్లో వ్యవసాయ దినసరి కూలి పనులు దొరుకుతున్నట్లు చెప్పారు.

తెలంగాణకు పయనమవుతున్న కూలీలు →



రేపు హొళగుంద పంచాయతీ వేలం

హొళగుంద: హొళగుంద మేజర్ పంచాయతీకి సంబంధించిన వేలం పాటలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ రాజశేఖర్, సర్పంచ్ మాల రంగమ్మ ఆదివారం తెలిపారు. పంచాయతీకి సంబంధించి జూలై 10 నుంచి 2025 మార్చ్ నెలాఖరు వరకు నిర్వహణకు గాను వారపు సంత మార్కెట్, బస్టాండ్, సుజల ప్రవంతి వాటర్‌ప్లాంట్, కమేళాకు వేలం పాటలు జరుగుతాయన్నారు. సాల్వెన్సు(సొంత ఆస్తులు) ఉన్న వారు బస్టాండ్, వారపు సంత మార్కెట్‌కు రూ. లక్ష, కమేళాకు రూ.10 వేలు, సాల్వెన్సు లేని వారు అదనంగా డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పాటదారులు పాడిన మొత్తంతో పాటు మూడు శాతం స్టాంపు డ్యూటీని అదనంగా చెల్లించాలని తెలిపారు. పాత బకాయిలు కట్టని వారికి వేలం పాటల్లో అనుమతి లేదన్నారు. డిపాజిట్‌లను నగదు రూపంలో ఇవ్వాలని.. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.